క్లుప్తంగా

దర్శి మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణారెడ్డి

దర్శి: దర్శి మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర అసంఘటిత కార్మికుల ఉద్యోగుల దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ దర్శి మండల ప్రజల అభిప్రాయాలపై ప్రభుత్వం సర్వే చేసి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దర్శి పట్టణంలో సంతకాల సేకరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో ఎక్కువగా రైతు కుటుంబాలు ఉండటం వలన మార్కాపురం జిల్లా కేంద్రానికి చిన్న పనిపై వెళ్లాలన్నా ఒక రోజంతా సమయం పడుతుందన్నారు. మార్కాపురానికి దర్శి పట్టణం నుంచి సుమారు 75 కిలోమీటర్ల దూరం ఉందని చెప్పారు. ప్రభుత్వంలోని పెద్దలు ప్రజల అభిప్రాయాలు సేకరించిన తర్వాతే వాళ్ల నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల కోటేశ్వరరావు, దర్శి పట్టణ అధ్యక్షుడు పాలేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



వైద్యులతో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి సూరిబాబు

పెద్దదోర్నాల: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య విధాన పరిషత్ ప్రోగ్రాం అధికారి సూరిబాబు సోమవారం పరిశీలించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం, పొదిలి, పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఆయన వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నీటి ఇబ్బందులను సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైద్యులు నాగమహేశ్వరి, వైద్య సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లూరు: ఏపీటీఎఫ్ మండల ఎన్నికల కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం తూర్పుగంగవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. మండల నూతన అధ్యక్షునిగా గండూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా నారిపెద్ది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా లేవీ ప్రసాద్, యోహాన్‌రెడ్డి, పద్మావతి వ్యవహరించారు. ఉపాధ్యాయులు హనుమంతరావు, నాగేశ్వరరావు, అంజిరెడ్డి, శేషులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, రవిచంద్రారెడ్డి, యాకోబు, అశోక్ చక్రవర్తి, ఖాజావలి, చంద్రిక, శిరీష, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెద్దదోర్నాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల నాయకులు



యర్రగొండపాలెంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



త్రిపురాంతకంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రబాబుది రైతు వ్యతిరేక ప్రభుత్వం

యర్రగొండపాలెం (పుల్లలచెరువు): చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. యర్రగొండపాలెంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏకుల మునలా రెడ్డి అధ్యక్షతన 'అన్నదాత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాతల పాలిట చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో విఫలమైందని చెప్పారు. యూరియా అందించకపోవడంతో రైతులు క్యూలైన్లు కట్టి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెం నాయుడు రైతులను అవమానించి మాట్లాడడం బాధాకరమైన విషయం అన్నారు. గతంలో జగనన్న ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని ఈసందర్భంగా గుర్తు చేశారు. మంగళవారం జరిగే అన్నదాత పోరుకు భారీ ఎత్తును రైతులు హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయ భాస్కర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కె. ఆదిశేషు, వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సూరె. రమేష్, టౌన్ అధ్యక్షుడు కే కాశీవిశ్వనాథ్, జిల్లా జనరల్ సెక్రటరీలు ఓబుల్‌రెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు అరుణాబాయ్, కె.వెంకటేశ్వరరెడ్డి, పి.పినిప్, శ్రీనివాసులు, కోటిరెడ్డి, రవణారెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పి.రాములునాయక్, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

త్రిపురాంతకం: 'అన్నదాత పోరు' కార్యక్రమం పోస్టర్ ను త్రిపురాంతకం మండల పార్టీ కాన్వీనర్ ఎస్ పోలిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతులు పెద్దసంఖ్యలో మార్కాపురం ఆర్డీఓ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.



పుల్లలచెరువులో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరిలో జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ తాళ్లూరు మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు గువ్వల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముందుగా నియోజకవర్గ కేంద్రమైన దర్శిలోని పార్టీ ఆఫీస్‌కు మంగళవారం ఉదయం 9:30 గంటలకు చేరుకుని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు కనిగిరి ఆర్డీఓ ఆఫీస్‌కు బయలుదేరతామని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు హాజరుకావాలని కోరారు.

పెద్దదోర్నాలలో..

పెద్దదోర్నాల: రైతులకు బాసటగా ఈ నెల 9వ తేదీ జరగనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను మండల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గుమ్మా యల్లేష్, దూదేకుల రసూల్, వల్లభనేని పవన్‌కుమార్, ఒంటేరు నాగేశ్వరరావు, దూదేకుల ఖాసింపీరా, జోగి వెంకటనారాయణ, పల్లా మల్లికార్జున, రావిక్రింది సుబ్బారావు, రఘు, దొందేటి కృష్ణారెడ్డి, సింగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువులో..

పుల్లలచెరువు: యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సాఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం మార్కాపురంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ దోమకాలు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎల్.రాములు, జిల్లాకార్యవర్గ సభ్యుడు జానికిరఘు, సర్పంచ్ ఎ.కోటిరెడ్డి, ఎ. రవణారెడ్డి, వెంకటరెడ్డి, నియోజికవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వాసు, మహిళా అధ్యక్షురాలు రవణమ్మ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ప్రసాద్, కాశయ్య, గురునాదం, సుందరరావు, శంకర్‌రెడ్డి, ఏడుకొండలు, రవణారెడ్డి, హనుమంతరావు, అనందరావు తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు మండలం నుంచి తరలిరావాలి...

కురిచేడు: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని కురిచేడు మండల పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల వెంకటసుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింపజేయాలన్నారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలనే డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని కనిగిరిలో ఆర్డీవోకు సమర్పిస్తున్నందున మండలం నుంచి విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

దొనకొండ మండలం నుంచి భారీగా పాల్గొనాలి...

దొనకొండ (కురిచేడు): రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరిలో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ దొనకొండ మండల అధ్యక్షుడు కాకర్ల కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న వారు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించాలి



త్రిపురాంతకం తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

దర్శి: రాష్ట్రంలో యూరియా, డీఏపీ కొరత లేకుండా రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు దర్శి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. సచివాలయాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు అందించాల్సిన ఎరువులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించని ప్రభుత్వం కనీసం ఎరువులనైనా సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది దళారులు యూరియా కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ముచేసుకుంటున్నారని విమర్శించారు. అక్రమ మార్గంలో బిల్లులు లేకుండా పట్టుబడిన యూరియా ఎక్కడి నుంచి వచ్చిందో నిగ్గుతేల్చాల్సిన అధికారులు గుడ్లప్పగించి చూస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికారులు, కూటమి నేతల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతోందని ఆరోపించారు. ఇటువంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, యూరియా సమస్యలు తీర్చాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, సీపీఐ దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించరా

త్రిపురాంతకం: రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో లేక పంటలు దెబ్బతిని నష్టపోతున్నారని, అక్రమ నిల్వలు, అధిక ధరలను అరికట్టాలని సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ చీరాల కృష్ణమోహన్‌ను కలిసిన రైతుసంఘం నాయకులు రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, డీఏపీ ఎరువుల కొరత ఉందని విమర్శించారు. రైతులకు ఎరువులు అందించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున్, ఆంజనేయులు, దాదా సాహెబ్, కాశీం పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రదీప్‌కుమార్

దర్శి: సైబర్ క్రైంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని నేషనల్ సెక్యూరిటీ కౌన్సిలర్ కే ప్రదీప్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి, అలా జరగకుండా విద్యార్థులు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తారో విద్యార్థులతో ప్రాక్టికల్‌గా చూపించారు. సాధారణంగా సైబర్ నేరగాళ్లు మన మొబైల్‌కి లింకులు, ఓటీపీలు పంపడం ద్వారా హాకింగ్ చేసే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రభుదాస్, అధ్యాపకులు నగేష్, రవీంద్ర, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి



పుల్లలచెరువు పారిశుధ్య చర్యలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో మరియదాసు

పుల్లలచెరువు: గ్రామాల్లోని ప్రజలు వారి ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో మరియదాసు అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాల్లో సోమవారం పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పుల్లలచెరువులో పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పంచాయతీ వారికి సహకరించాలన్నారు. ఇళ్ల ముందు మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆత్మ, సర్పంచ్ ఓబులేసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలి



పోశం మధుసూదన్‌రెడ్డి

తాళ్లూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేశారని, వాటిని కూటమి ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిపై ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తాళ్లూరు మండల మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన రాష్ట్రంలో డాక్టర్ విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులపై ఫీజుల భారం పడుతుందన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేద ప్రజలకు ఆరోగ్య శ్రీ పథకం అమలు చేసి ఉచితంగా వైద్యం అందించి ఖర్చుల భారం తగ్గేలా చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షాలా మారిందన్నారు. మెడికల్ కళాశాలల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ అనే ఆలోచనను మానుకుని కూటమి ప్రభుత్వం మానుకోవాలని కోరారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి

దొనకొండ (కురిచేడు): అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆదిమూలపు ప్రభుదాసు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా దొనకొండ మండలంలోని పోలేపల్లి ఎస్సీకాలనీలో ఉన్న మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. అక్షరాస్యత, నిరక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా న్యాయం, శాంతి, స్థిరత్వానికి పునాదిగా అక్షరాస్యత పెంచాలని ఆయన తెలిపారు. పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బీవీ రామాంజనేయులు, పాఠశాల చైర్మన్ మురికిపూడి రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అక్షరాస్యత ప్రాదాన్యత గురించి వివరిస్తున్న ప్రభుదాసు

ప్రతిఒక్కరూ విద్యపై మక్కువ చూపాలి

దర్శి: ప్రతిఒక్కరూ విద్యపై మక్కువ చూపాలని కట్ట శింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకరరావు సూచించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని, చదువు వలనే అన్ని రకాలుగా అభివృద్ధి చెందగలమని తెలిపారు. ఉపాధ్యాయుడు గొర్రెపాటి వేణు విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల పుస్తకాలు, వివిధ రకాల కథల పుస్తకాలను సొంత నిధులతో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమావతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కథల పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేణు

ఫోర్టిఫైడ్ ఆహారం ఆరోగ్యానికి సోపానం

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఫోర్టిఫైడ్ ఆహారం- ఆరోగ్యానికి సోపానం అనే అంశానికి సంబంధించిన పోస్టర్లను ఎంఈఓ 2 ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజనానికి సన్న బియ్యం ఫోర్టిఫైడ్ బియ్యంగా మార్చి పంపిణీ చేస్తున్నారని, 100 కేజీల బియ్యానికి ఒక కేజీ సూక్ష్మ పోషకాలు అయిన విటమిన్ బీ 12, ఫోలిక్ యాసిడ్, విటమిన్ ఏ, మొదలైన సూక్ష్మ పోషకాలను కలుపుతారన్నారు. కొంత మంది సీసీహెచ్‌పై అవగాహన లేక ప్లాస్టిక్ బియ్యమని వాటిని తీసి బయట పడేస్తున్నారని, అలాగే బియ్యాన్ని ఎక్కువ సార్లు నీటితో కడిగి పారబోస్తున్నారని, అలా కాకుండా బియ్యాన్ని ఒక సారి కడిగితే సరిపోతుందని చెప్పారు. ప్రోగ్రాం అసోసియేట్ శ్యాంబాబు మాట్లాడుతూ తమ సంస్థ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోర్టిఫైడ్ ఆహారం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, ఉపాధ్యాయులు, కుకింగ్ ఏజన్సీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ 2 ఎస్‌సీహెచ్ సుబ్రహ్మణ్యం



తాళ్లూరు మీదుగా దర్శి వెళ్లే పల్లెవెలుగు బస్సు

ఆర్టీసీ బస్సు.. సమయపాలన తుస్సు..!

- సమయానికి బస్సు రాక ప్రయాణికులకు ఇబ్బందులు
- కళాశాలలు, పాఠశాలలకు టైంకి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆవేదన
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

తాళ్లూరు: కూటమి ప్రభుత్వంలో ఏపీఎస్‌ఆర్టీసీని గాలికొదిలేయడంతో పర్యవేక్షణా లోపం కారణంగా బస్సులు సమయానికి తిరగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోలా బస్సులు సమయానికి రావడం లేదని వాపోతున్నారు. తాళ్లూరు మండలం నుంచి దర్శి మార్గంలో ఉదయం వెళ్లే బస్సు కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ముఖ్యమైనది. ఈ బస్సు ఒంగోలు నుంచి ఉదయం 7.15 గంటలకు బయలుదేరి దర్శి పట్టణానికి తూర్పుగంగవరం మీదుగా వస్తుంది. ఈ బస్సుపై ఆధారపడి ప్రతిరోజూ ఉదయం చాలా మంది ప్రయాణిస్తుంటున్నారు. అయితే, కొన్ని రోజుల నుంచి ఈ బస్సు సరైన సమయానికి రాకపోవడం వలన కళాశాలలు, పాఠశాలలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర కార్యాలయాలకు వెళ్లేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతులకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని, 1, 2 పీరియడ్‌లు తరగతులకు అనుమతించకుండా బయట నిలబెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. కొన్నిసార్లు అధిక సంఖ్యలో ప్రయాణికులతో బస్సు రద్దీగా ఉండటం వలన నిర్దీత స్టాప్‌లలో ఆపకుండా వెళ్తున్నారని, దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని, దానివలన ఇంకా లేటవుతోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇతర బస్సులు కూడా సమయపాలన పాటించకపోవడంతో గంటల తరబడి సమయం వృథా అవుతోందని తాళ్లూరు మండలంలోని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సులను సమయానికి నడపాలని కోరుతున్నారు.

“ గతంలో సమయానికి బస్సులొచ్చేవి



గతంలో ఒంగోలు డిపో నుంచి ఉదయం 7-15 గంటలకు బస్సు బయలుదేరేది. కానీ కొన్ని రోజుల నుంచి ఉదయం 7-30కు మొదలవుతోంది. దానివలన నాతో పాటు చాలా మంది కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలస్యంగా చేరుకుంటూ అవస్థ పడుతున్నారు. ఈ బస్సు ఎప్పటిలాగే సమయానికి వచ్చేలా చూడాలని ఆర్టీసీ అధికారులను కోరుకుంటున్నా.

– సంగు రవిచంద్రారెడ్డి, లక్కవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు

“ సమయానికి బస్సు రావడం లేదు



మా అబ్బాయి దర్శి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ప్రతిరోజూ కళాశాలకు బస్సులో ప్రయాణం చేస్తుంటాడు. ఈ మధ్య కొన్నిరోజుల నుంచి బస్సు సమయానికి రావడం లేదు. కళాశాలకు సరైన సమయానికి వెళ్లలేకపోతున్నాడు. దీంతో మా అబ్బాయిని ఉపాధ్యాయులు ఉదయం జరిగే తరగతులకు అనుమతించడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమయానికి మా గ్రామానికి బస్సు వచ్చేలా చూడాలి.

– దేవరకొండ మధు, బెల్లంకొండవారిపాలెం

“ అర్జీ ఇస్తే పరిశీలిస్తా :

బస్సు ఆలస్యంగా నడుస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరు ఫిర్యాదు చేయలేదు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యను అర్జీ రూపంలో తమకు అందిస్తే పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

– ఆర్టీసీ డిపో మేనేజర్, పొదిలి